కథ

# ఉచ్చు

- జయసూర్య




**బ్లూ** రంగు 'పీక్ కాప్' అద్దం ముందు నిలబడి మళ్ళీ సరిచేసుకుంది. 'ఖాకీ యూనిఫాంలో అందంగా వున్నానే' అనుకుంది తనలో తాను. తాను ఇప్పుడు ఎ.పి. పోలీసు ఉద్యోగి. ఒక్క క్షణం గర్వం తొంగి చూసింది. అమ్మ పోలీసు ఉద్యోగం వద్దంది. హంతకులు, దొంగలుంటారు. రౌడీలుంటారు. నువ్వు ఆడపిల్లవి. నువ్వు వేగలేవంది. అయినా నచ్చచెప్పి చేరింది. స్కూల్లో రన్నింగ్ కాంపిటీషన్‌లో ఎప్పుడు తానే ఫస్ట్. పైగా ఎన్.సి.సి. కాడెట్. ట్రెనింగ్ ఇట్టే అయిపోయింది. టౌన్‌స్టేషన్ డ్యూటీలో జాయిన్ అయింది. ఇప్పుడిప్పుడే పోలీసు స్టేషన్‌కు అలవాటుపడుతోంది.

నాన్న చిన్నప్పుడే పోవడంతో మావయ్య సహాయంతో అమ్మ కష్టపడి ఇంటర్మీడియట్ చదివించింది. అన్నయ్య, బాధ్యత లేకుండా జులాయిగా తిరుగుతూ అమ్మను డబ్బుకోసం వేధించేవాడు. ఉన్నట్టుండి ఎక్కడకు పోయాడో ? ఏడాది నుంచి ఇంటిమొహం చూడలేదు. తనకు ఉద్యోగం వచ్చింది కాబట్టి అమ్మను చూసుకోవచ్చనుకుంది వనజ. మరొకసారి అద్దంలో చూసి యూనిఫామ్ సరిచేసుకుంటూ.

లేడీబర్డ్ సైకిలు మీద వనజ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరింది. రోడ్డు మీద వున్నవారి చూపులన్నీ తనపైనే. తాను అందమైందని వనజకు తెలుసు. ఇప్పుడు తనను ఒకసారి చూసినవాడు మళ్ళీ చూడడు. మఫ్టీలో వుంటే ఆ ఇబ్బంది తెలుస్తోంది. తాను ఇప్పుడు లేడీ కానిస్టేబుల్. తన వైపు మరోసారి చూడటానికి, అనవసరంగా మరో మాట మాట్లాడటానికి మగాళ్ళు జంకటం సంతోషం కలిగిస్తోంది. అందంగా, అమాయకంగా వుండే ఆ మొహంలో ధైర్యం పైగా కొంచెం గర్వం. టౌన్ పోలీస్ స్టేషన్‌లో తెల్లవారకుండానే హడావిడి ప్రారంభమైంది. ఎస్. ఐ గారు ఇంకా రాలేదు. చుట్టుపక్కల పల్లెటూళ్ళనుండి గుంపులుగా జనం చేరుకుంటున్నారు. స్టేషన్ బయట రావి చెట్టు. ఇటుకలు ఊడిపోతున్న చప్టా మీద కొందరు, చక్రాలు లేని టీబండి దగ్గర నలుగురైదుగురు కబుర్లు చెప్పుకుంటున్నారు. సైకిలు దిగి స్టాండ్ వేసింది వనజ.

ఆమెకు ఇరవై ఏళ్ళలోపు వయస్సుంటుంది. నల్లగా వున్నా ముఖం కళగా ఉంది. చీరె మాసి నలిగిపోయి వుంది. చేతులకు ఎర్రగాజులు. పేదకుటుంబానికి చెందినట్టుగా తెలుస్తోంది. సైకిలు దిగిన వనజ దగ్గరకు గబగబా వచ్చింది. పోలీసమ్మా! అని పిలిచింది నెమ్మదిగా. అప్పుడే స్టేషన్‌లోకి అడుగుపెడ్తున్న వనజ ఆగి ఏమిటన్నట్టు చూసింది. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు. మాట రావడం లేదు. వనజకు జాలేసింది. పి.సి.లు ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. వెనక్కి తిరిగి ఏం కావాలంది. ''రాత్రి లాడ్జి. రైడింగ్... '' అంది ఆ అమ్మాయి. వనజకు ఆమె పరిస్థితి అర్థమైంది. ''నేనేం చేగలను?'' అంది. ఆ అమ్మాయి వనజ దగ్గరగా వచ్చింది. నెమ్మదిగా చెప్తోంది.

''ఇంట్లో గడవడం లేదమ్మా! నాన్నకు రోజూ తాగడానికి డబ్బు కావాలి, అమ్మను రోజూ కొడతాడు. డబ్బు తెమ్మని. అమ్మ ఒళ్ళు బాలేదు. ఇంక చచ్చిపోతుందని చెప్పారు గవర్నమెంటాసుపత్రి డాక్టరు. అందుకని... ఇదే మొదటిసారి. తప్పు చేశానమ్మా!''అంది ఏడుస్తూ. వనజకు ఏం చేయాలో అర్థంకాలేదు. ''నన్నేం చేయమంటావు?'' అంది.

ఇంతలో ఎస్. ఐ.గారి మోటారు సైకిలు వచ్చింది. ''గుడ్ మార్నింగ్ సర్'' సెల్యూట్ చేసింది వనజ. ఎస్. ఐగారు లోపలికి వెళ్ళటంతోనే వనజ రైటర్ గారి రూమ్‌లోకి వెళ్ళింది. డ్యూటీ ప్రారంభమైంది. ఖైదీలకు ఆడవాళ్ళకు ఎస్కార్ట్, ట్రాఫిక్, బందోబస్తు, మహిళా ఖైదీలకు సంబంధించిన ముద్దాయిలు, నేరస్థులతో వుండాలి. స్టేషన్ రోజువారి డైరీని బట్టి పనులు. ఊపిరి సలపని విధుల నిర్వహణలో నిమగ్నమైంది. ఆ రోజూ స్టేషన్ డ్యూటీ.

ఆ అమ్మాయి ఇంకా అక్కడే తచ్చాడుతోంది. వనజకు ఆమె పట్ల ఆసక్తి వున్నా, ఎస్. ఐ గారితో మాట్లాడలేని పరిస్థితి.మధ్యాహ్నం ఎస్. ఐ గారి ఆర్డర్ ప్రకారం ఒక్కొక్కరు తమ కేసులు బాధలు చెప్పుకుంటున్నారు. ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారు. నేరారోపణలు, సాక్షుల సేకరణలు, కేసుల ఎఫ్.ఐ.ఆర్, వేలిముద్రలు, సంతకాలు ఒకటే హడావిడి. బ్రోతల్స్‌ను లోపలకు పిలిచారు. ఆ అమ్మాయి గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. పెట్టీ కేసు మెజిస్ట్రేటు కోర్టులో హాజరుపరచవలసిందిగా ఎస్. ఐ. ఆదేశం. చకాచకా అమలు జరిగిపోయాయి.

మేజిస్ట్రేట్ కోర్టులో నేరం అంగీకరించిన బ్రోతల్స్‌ను ఆ రోజు ఒక్కొక్కరికి రూ-200ల చొప్పున జుల్మానా విధించారు. పొద్దున్నుంచి ఆ అమ్మాయి ఒక కప్పు టీ కూడా తాగకపోవడం వనజ గ్రహించింది. స్టేషన్‌లో కొంచెం తెరిపి వచ్చింది. బయటకి వచ్చి ఆ అమ్మాయిని పిలిచింది. బండి దగ్గర టిఫిన్, టీ ఇప్పించింది. డబ్బులు వద్దన్నాడు బండి యాజమని అయినా తాను ఇచ్చింది. ఆ అమ్మాయి జీవన దైన్యం, నిస్సహాయత వనజను కదిలించింది. కోర్టు విధించిన జుల్మానా కట్టేటప్పటికి సాయంత్రం అయింది. అక్కడకు లావుగా, పొట్టిగా వున్న ఒక నల్లటి ఆసామి వచ్చి ఆ అమ్మాయికి కూడా పెట్టుబడి ఇస్తున్నాడు. చెట్టుకింద తతంగాన్ని వనజ చూసింది. లేడీ కానిస్టేబుల్ దగ్గరకు రావడంతో ఆ వ్యక్తి ''ఈ అమ్మాయి సంగతి నేను చూసుకుంటాను మేడమ్'' అన్నాడు. ''అక్కర్లేదు నువ్వు పో'' అంది కటువుగా. ఆ అమ్మాయి కృతజ్ఞతగా చూస్తోంది. ''ఇంకెప్పుడు ఈ ఉచ్చులో పడకు'' అంది వనజ వార్నింగ్‌గా.

★

# వర్మ మరో హీరోయిన్

హీరోయిన్‌లను ఎంపిక చేయడంలో రామ్‌గోపాల్ వర్మకి తిరుగులేదు. అతను ఎంపిక చేసిన హీరోయిన్లంటే ప్రేక్షకుల చూపే వేరు. హీరోయిన్ అంటే ఇలా ఉండాలని వర్మ ఎలా అనుకుంటారో అలాగే అతన్ని ఇష్టపడే ప్రేక్షకులు కూడా 'వర్మ హీరోయిన్' అంటే ఇలాగే ఉండాలని కళ్ళింతవి చేసుకుని చూస్తారు. ఊర్మిళ, అంత్రామాలి,నిషా కొఠారి, జియాఖాన్...ఇలా వర్మ హీరోయిన్లంటే ప్రేక్షకులకు కనువిందే! ఇప్పుడు సరికొత్తగా వర్మ మరో హీరోయిన్‌ని తెర మీదికి తీసుకొస్తున్నారు. ఆమె పేరు అమృతా ఖాన్‌విల్‌కర్. వర్మ దర్శకత్వం వహించే ఓ సినిమాలో మాత్రమే అమృత హీరోయిన్ కాదు, అతను దర్శకత్వం వహించే మరో చిత్రంలో కూడా అమృతే హీరోయిన్. అంటే వర్మ రెండు చిత్రాల్లో అమృత హీరోయిన్ అన్నమాట! పూనేకి చెందిన అమృత ఇంతకు ముందు విక్రమ్ భట్ దర్శకత్వంలో నటించింది. అయితే అది అంతగా చెప్పుదగింది కాదు. వర్మ కళ్ళల్లో పడక ముందు టీ.వీ.రంగంలో కూడా ప్రవేశించడానికి ప్రయత్నించింది. అయితే అదృష్టం కలిసొచ్చి అమృత టీ.వీ.రంగానికి చేరక ముందే వర్మ ఫ్యాక్టరీకి తరలి వచ్చింది. వర్మ దర్శకత్వం వహిస్తోన్న 'సర్కార్ రాజ్'లో అమృత ఇపుడు నటిస్తోంది.

